రేపు విజయదుర్గ ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవానికి ముస్తాబైన శ్రీవిజయదుర్గ ఆలయం

సైదాబాద్: సైదాబాద్ మాతామైదాన్‌లో కొలువుదీరిన శ్రీవిజయ దుర్గా మాతా ఆలయం వార్షికోత్సవానికి ముస్తాబైంది. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఈనెల 12న (ఆదివారం) ఆలయం 19వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ అర్చకులు ఉదయం అమ్మ వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారని, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. వార్షికోత్స వానికి తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా అష్టలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు



శేష వాహన సేవలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయం 28వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 2వ రోజు శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్వారతోరణ, మూర్తి కుంభస్థాపన, అగ్నిప్రతిష్ఠ, హోమం, ధ్వజారోహణ, బలిప్రదాన పూజలు నిర్వహించారు. ఇష్టిశాలలో సంతానము లేనివారికి, సంతానప్రాప్తి కోసం ధ్వజారోహణ సమయంలో గరుడ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమా సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అంజయ్య, వైస్ చైర్మన్ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆలయంలో శనివారం యాగశాలలో పూర్ణాహుతి, ఎదురుకోలు ఉత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి 'పట్నం'ను గెలిపించాలి: సీపీఎం



రాజీవ్‌శెట్టినగర్‌లో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

హస్తినాపురం: వామ పక్షాలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎల్‌బీనగర్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేష్‌గుప్తానగర్, నందనవనం, రాజీవ్‌శెట్టినగర్ కాలనీల్లో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో మతోన్మాద విధానాలను అమలు చేస్తూ దేశంలో ఐక్యత లేకుండా విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తోందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీలకు ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలని అన్నారు. సీపీఎం కమిటీ సభ్యులు దుర్గారావు, గణేశ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు కాంగ్రెస్‌కు అండగా నిలవాలి



ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, వేదికపై మల్‌రెడ్డి రాంరెడ్డి

నాగోలు: రాష్ట్రంలోని ఆర్యవైశ్యులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం నాగోలు కో–ఆపరేటివ్ కాలనీలోని ఉప్పల నివాసంలో ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిలు మాట్లాడుతూ, పేద ఆర్యవైశ్యులను ఆదుకొనేందుకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్యవైశ్యులు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. హస్తం గుర్తుకు ఓటు వేసి మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి, చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి, భువనగిరి అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, పబ్బ చంద్రశేఖర్, నాగోల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మంజుల రెడ్డి, డాక్టర్ ఏఆర్ గుప్తా, ప్రవీణ్ పాల్గొన్నారు.

జనం లేని 'జన జాతర'

కాంగ్రెస్‌లో కుమ్ములాటలు
- నేతల మధ్య సమన్వయ లోపం
- వెరసి వెలవెలబోయిన సభ



సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన జనజాతర సభలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఎల్‌బీనగర్/మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ నేతల సమన్వయ లోపం, పార్టీలోని అంతర్గత కుమ్ములాటలతో సరూర్‌నగర్ స్టేడియంలో గురువారం జనజాతర సభ నిర్ణయించిన సమయానికి ప్రారంభం కాలేదు. ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీలో పార్టీ నేతలు ఎవరికి వారే.. యమునా తీరే అన్న చందంగా వ్యవహరించడం, ఆధిపత్య పోరు కారణంగా జనజాతర సభకు నిర్ణయించిన సమయానికి జనాలను తరలించలేక పోయారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సభాస్థలికి చేరుకున్న సమయానికి ప్రాంగణంలో కొద్ది మంది మాత్రమే ఉన్నారు. దీంతో ఆయన 45 నిమిషాలకు పాగై అక్కడే ఉన్న వ్యాన్‌లో ఉండిపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా పోలీసులకు సూచనలు చేస్తూ స్టేడియం బయటకు వచ్చి.. బయట ఉన్న జనాలను స్టేడియంలోకి తీసుకెళ్లారు. ముఖ్య అతిథి సమయానికి వచ్చినా స్టేడియంలోకి జనాలను తరలించకపోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకుల మధ్య అంతర్గత పోరుతో రాహుల్‌గాంధీ సభనే స్థానిక కాంగ్రెస్ నాయకులు సమర్థవంతంగా నిర్వహించకపోవడంపై కాంగ్రెస్ పెద్దలు మండిపడినట్లు విశ్వసనీయ సమాచారం.

పాత, కొత్త నేతల మధ్య విభేదాలు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇతర పార్టీల నుంచి నాయకులు కాంగ్రెస్‌లోకి వలస వచ్చారు. పాత నాయకుల మధ్య విభేదాలున్నా సర్దుకపోయారు. కొత్తగా మరి కొంతమంది చేరడంతో పాత, కొత్త నాయకులు ఆధిపత్య పోరు ప్రదర్శించటంతో విభేదాలు తారస్థాయికి చేరాయి. బూత్ కమిటీల విషయమై పాత, కొత్త నాయకుల మధ్య కుమ్ములాటలు జరుగుతున్నాయి. ఇటీవల బూత్ కమిటీల విషయమై కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ జరిగి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అంతేకాకుండా చంపాపేటలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్ నేతలు ఒకరినొకరు దూషించుకున్నారు.

అభివృద్ధి కావాలంటే బీఆర్ఎస్‌కు ఓటెయ్యండి



పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



మన్సూరాబాద్‌లో జరిగిన బీఆర్ఎస్ ర్యాలీ

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని మల్కాజిగిరి ఎంపీగా ఎన్నుకుందామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్‌లోని ఇందిరానగర్ కాలనీ నుంచి మన్సూరాబాద్ ఓల్డ్ విలేజ్ వరకు శుక్రవారం లక్ష్మారెడ్డికి మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వల్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, మాజీ అధ్యక్షుడు జగదీష్‌యాదవ్, నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్ మేళాను సద్వినియోగం చేసుకోండి



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియంలోని గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్)ను వనస్థలిపురం, పరిసర కాలనీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు అక్బర్‌అలీ అన్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతావర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, చెప్పులు, గాజులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని ఆయన తెలిపారు. ఈ అవకాశం మరో రెండు రోజులు మాత్రమే ఉంటుందని ఆయన అన్నారు.

మల్కాజిగిరి సంక్షేమానికి ఈటలను గెలిపించాలి: కొప్పుల



మన్సూరాబాద్‌లో ప్రచారం చేస్తున్న కొప్పుల నర్సింహారెడ్డి



ఈటలకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న మొద్దు లచ్చిరెడ్డి తదితరులు

మన్సూరాబాద్: దేశం, ధర్మం కోసం ఢిల్లీలో నరేంద్ర మోదీని, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సంక్షేమం కోసం ఈటల రాజేందర్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని హిమపురికాలనీ, డీపీనగర్, బాల్‌రెడ్డినగర్, చండీశ్వరకాలనీ, శైలజాపురి కాలనీ, సీఆర్ఎన్‌క్లేవ్, శ్రీరామ్‌నగర్‌కాలనీలలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి కమలం పువ్వు గుర్తుకు ఓటెయ్యాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయా కాలనీలవాసులు కొప్పుల ఉపేందర్‌రెడ్డి, గోపికృష్ణారెడ్డి, జంగారెడ్డి, రాములు, మార్కండేయ, రవీందర్‌రావు, నాయకులు మునగాల హరీష్‌రెడ్డి, పాతూరి శ్రీధర్‌గౌడ్, ఎంజగల జగన్, సురేష్, గోపి యాదవ్, రాము, అలివేలు, మంగ, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈటలను గెలిపిస్తే అభివృద్ధి

ఎల్‌బీనగర్: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన బీఎన్‌రెడ్డినగర్, వైదేహినగర్, శ్రీకృష్ణదేవరాయనగర్ కాలనీల్లో కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈటలను గెలిపిస్తే ఎల్బీనగర్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. దామోదర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, నారాయణరావు, విష్ణువర్ధన్ రావు, రవిశంకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, దేవిక, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యువజన నాయకులు బీజేపీలో చేరిక

వనస్థలిపురం: తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ ఎల్‌బీనగర్ నియోజకవర్గం యువజన నాయకులు విజయ్, విక్కీ వారి మిత్రబృందం మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, చిన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఈటల సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

చలివేంద్రం ప్రారంభం



నాగోలు: వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాగోలు చెరుకు శంకరయ్య గౌడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ట్రస్ట్ చైర్మన్ చెరుకు ప్రవీణ్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లుగా తమ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వేసవి ఉధృతి దృష్ట్యా బాటసారులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ, మంచినీరు పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అనంతుల రాజారెడ్డి, చెరుకు ప్రశాంత్‌గౌడ్, చెరుకు జంగయ్యగౌడ్, శివకుమార్, తూర్పటి చిరంజీవి, రావుల సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటి సంక్షేమం, ప్రగతికి పాటుపడతా..

మల్కాజిగిరి పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్



ఎన్నికల ప్రచారంలో తన గుర్తును చూపిస్తున్న వైష్ణవీ ప్రసాద్

నాగోలు: పార్లమెంట్ ఎన్నికల్లో తనను మల్కాజిగిరి ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని స్వతంత్ర అభ్యర్థి పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. శుక్రవారం ఆయన ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, నాగోలు, హయత్‌నగర్, ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని చిలుకానగర్, కల్యాణ్‌పురి, రామంతాపూర్ తో పాటు మేడ్చల్, కూకట్‌పల్లి, కంటోన్మెంట్ నియోజకవర్గాల పరిధిలోని వివిధ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్ మాట్లాడుతూ, తనను మల్కాజిగిరి ఎంపీగా గెలిపిస్తే నియోజకవర్గం పరిధిలో రైల్వే క్రాసింగ్ సమస్యలు, కంటోన్మెంట్‌లోని రోడ్డు సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మల్కాజిగిరిని అభివృద్ధి పథంలో ముందు ఉంచేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రతీ ఇంటి సంక్షేమం, ప్రగతి కోసం పనిచేస్తానని అన్నారు. బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపర్చిన తనను ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్‌కు కాలనీవాసులు పెద్దఎత్తున సంఘీభావం తెలిపారు. నాయకులు శ్రీనివాస్, గంగాధర్, మూర్తి, శ్రీవాత్సవ, సుబ్రహ్మణ్యం, రాజేశ్వరరావు, ప్రబల విశ్వనాథం, కైలాస్, రజిని, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

పీవీ రావుకు ఘన నివాళి



ఎల్‌బీనగర్‌లో పీవీ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

మన్సూరాబాద్: మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు జయంతి ఉత్సవాలు ఎల్‌బీనగర్‌లో శుక్రవారం నిర్వహించారు. డా.బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద తెలంగాణ మాల మహానాడు కార్యనిర్వాహక అధ్యక్షుడు కొంగర నర్సింహారావు ఆధ్వర్యంలో పీవీ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాల మహానాడు అధ్యక్షుడు యాట సత్యనారాయణ, గద్దె శ్రీనివాస్, శంకర్, జగన్, గాదరి లింగయ్య, మారయ్య, పెరుమాండ్ల శంకర్, నర్సింహ, నీలం కృష్ణ పాల్గొన్నారు.

– మాల మహానాడు ఎల్‌బీనగర్ నియోజకవర్గం నాయకుడు చింతపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్‌లో కేక్ కట్ చేసి పీవీరావు జయంతిని జరుపుకున్నారు. తీగల మహేష్, యాత సత్యం, బీఎల్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలోని గొలుసు స్నాచింగ్‌కు యత్నం

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

చైతన్యపురి: మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసు చోరీకి యత్నించిన వ్యక్తిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా, కొండ మల్లేపల్లి గ్రామం గాడినగర్ తండాకు చెందిన వడ్త్యా జ్యోతి కర్మన్‌ఘట్ శ్రీసాయినగర్‌లోని సాయిరాం ఆలయంలో దగ్గర శుక్రవారం ఉదయం కూరగాయలు కొనుగోలు చేస్తోంది. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును తెంచుకెళ్లేందుకు యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలు సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు గ్రీన్‌పార్క్ కాలనీ చెందిన నిషానం ప్రవీణ్‌బాబును నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు.

భార్యతో వివాదం.. భర్త ఆత్మహత్య

నాగోలు: భార్యతో ఏర్పడిన వివాదం నేపథ్యంలో భర్త ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగోలు పోలీస్ స్టేషన పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...బండ్లగూడ పరిధిలోని మత్తుగూడ, వెంకటేశ్వర కాలనీలో మల్లె వెంకటేష్(35) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. మద్యానికి బానిసైన వెంకటేష్ ప్రతి రోజూ మద్యం తాగేవాడు. ఈ నేపథ్యంలో గతనెల 26న భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య పిల్లల్ని తీసుకొని ఆనంద్‌నగర్, సహభావన టౌన్‌షిప్‌లో ఉండే తల్లిగారి ఇంటికి వెళ్లింది. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న వెంకటేష్ తాను నివాసం ఉంటున్న ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన అతని తండ్రి పెద్దులు గురువారం సాయంత్రం నాగోలు పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా తరలించారు. వెంకటేష్ మృతికి గల కారణాలపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

సుపరిపాలన మోదీతోనే సాధ్యం



బ్రాహ్మణ ఆర్యవైశ్య సమ్మేళనంలో పాల్గొన్న నారాయణం చక్రవర్తి తదితరులు

నాగోలు: దేశంలో సుపరిపాలన, సనాతన ధర్మ పరిరక్షణ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతోనే సాధ్యమని, ఆయనే మళ్లీ ప్రధాని కావాలని రాష్ట్ర ధార్మిక పరిషత్ జాయింట్ కన్వీనర్ సభ్యులు నారాయణం చక్రవర్తి అన్నారు ఉప్పల్–ఎల్‌బీనగర్ బ్రాహ్మణ ఆర్యవైశ్య సమ్మేళనం గురువారం రాత్రి నాగోలు డివిజన్ అల్కాపురిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ వారికి ఓటుపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... మోదీ అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తున్నారని, అలాగే అన్ని రంగాలను అభివృద్ధి పథంలో దూసుకెళ్లేలా నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. భారత దేశం పూర్వకాలంలో ఏ విశ్వగురు స్థానంలో ఉందో అదే విశ్వగురు స్థానం సాధించాలంటే మళ్లీ మోదీని ప్రధాన మంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ధార్మిక సంస్థ కన్వీనర్ అన్నవజ్జుల సూర్య ప్రకాశ్, కో కన్వీనర్ నిరంజన్ దేశాయ్, పలు బ్రాహ్మణ సంఘాల నాయకులు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలికి తీవ్రగాయాలు

హస్తినాపురం: తన ఇంటి బాల్కనీలో ఉన్న పావురాలను వెళ్లగొట్టేందుకు చేతిలోని ఇనుప కర్రతో యత్నించిన వృద్ధురాలు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన హస్తినాపురం డివిజన్‌లోని ద్వారకానగర్ కాలనీలో జరిగింది. కాలనీకి చెందిన అల్లం వనజ (65) బుధవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో తన ఇంటిలోని బాల్కనీలోకి పావురాలు రాగా తన చేతిలో ఉన్న ఇనుప కర్రతో వాటిని చెదరగొట్టేందుకు యత్నించగా, అది ఇంటి ముందు ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లకు తాకడంతో కరెంట్ షాక్‌కు గురైంది. ఈ ప్రమాదంలో వనజ చేయి, చాతిపై తీవ్ర గాయాలు కావడంతో దగ్గరలో ఉన్న వెల్‌నెస్ ఆసుపత్రిలో చేర్పించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, ఇంటి పక్కన ఉన్న అపార్ట్‌మెంట్ కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా అధికారులు 11 కేవీ విద్యుత్ తీగలను ఏర్పాటు చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ యువజన విభాగం మాజీ అధ్యక్షుడు మాధవరం నర్సింహారావు ఆరోపించారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ఓట్ల కోసమే 'ఈటల' బీసీ నినాదం

వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య



విలేకరులతో మాట్లాడుతున్న వీరయ్య

వనస్థలిపురం: ఓట్ల కోసమే మల్కాజిగిరి నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ బీసీ నినాదాన్ని ఎత్తుకున్నారని వికలాంగుల కార్పొరేషన్ సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. శుక్రవారం వనస్థలిపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే వికలాంగుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందని అన్నారు. బీసీ వసతి గృహాల్లో చదువుకున్నానని చెప్పుకునే బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఏనాడు వసతి గృహాల సమస్యలు పరిష్కరించలేదని అన్నారు. వికలాంగులకు విద్య, ఉద్యోగ, రిజర్వేషన్లు కల్పించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. మల్కాజిగిరి అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని, బీసీ ముసుగులో ఉన్న ఈటల రాజేందర్‌ను ఓడించాలని వీరయ్య అన్నారు.

కమీషన్లకు ఆశపడే వరద కాలువ పొడిగింపు

హయత్‌నగర్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



వరద కాలువ పొడిగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: అవసరం లేకున్నా అధికారులు కమీషన్లకు ఆశపడే వరద కాలువ పైప్‌లైన్‌ను పొడిగిస్తున్నారని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ పనులను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. వివరాలు.. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కుమ్మరికుంట చెరువులోకి మురుగు నీరు వస్తుందంటూ కుంటకు ఉన్న వరద నీటి కాలువను పొడిగించి బాతుల చెరువులోకి డ్రైనేజీ నీరు చేరేలా అధికారులు పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శుక్రవారం స్థానికులతో కలిసి వెళ్లి ఆ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన వరద కాలువలోకి డ్రైనేజీ నీరు వస్తోందని, దానిని నివారించలేని అధికారులు అవసరం లేకున్నా..వరద కాలువ పైప్‌లైన్‌ను పొడిగించి మురుగునీరు దిగువన ఉన్న బాతుల చెరువులో కలిపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కుమ్మరికుంట కట్ట వెడల్పు చేయాలని విన్నవించినా పట్టించుకోని అధికారులు కేవలం కమీషన్ల కోసమే వరద కాలువను పొడిగించేందుకు యత్నిస్తున్నారని అన్నారు. అధికారుల చర్యల కారణంగా మురుగు నీరు చేరి బాతుల చెరువు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, పైప్‌లైను పనులను ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటామన్నారు. కాగా, పైప్‌లు వేసే క్రమంలో తాగునీటి పైప్‌లైన్ పగిలి నీరంతా చెరువులోకి వెళ్తోంది. అసలే తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీరు వృథాగా పోతున్నదని కార్పొరేటర్ మండిపడ్డారు.